# మీరజాలగలడా!

రచన:
'హయగ్రీవ్'

ఆఫీసునుండి వచ్చిన రాజారావ్‌కు, తన సతీమణీ కాఫీతో ఎదురు రావటం కలా... నిజమా అన్నంత ఆశ్చర్యాన్ని కలిగించింది. మహిళా సమాజానికి ఎంతైనా సేవచేసి మెప్పులు పొందుతుందిగాని, తన భర్తకు, పిల్లలకు సేవచేయడం ఆమె జాతకంలో లేదు. క్లబ్బు ఆమెలో సగం దేహం. అటువంటిది ఆమె స్వయంగా కాఫీ తన కందించడం, తనకు సపర్యలు స్వయంగా చేయడం, ఇదంతా ఏదో కొంప ముంచటానికే అని అనుకొన్నాడతను. ఇలా ఆలోచనలలో పడిన రాజారావ్ గారు, అతని భార్య చిలక పలుకులువిని ఈ లోకంలో కొచ్చాడు.

"కాఫీ తీసుకోండి, చాలా అలసిపోయినట్లున్నారు. స్నానానికి నీళ్లుపెట్టనా'' ఇవన్నీ వింటున్న రాజారావ్‌కు ఆమె ఎగతాలి చేస్తున్నట్టు కనిపించిందే కాని స్వయంగా చిత్తశుద్ధితో అన్న మాటల్లా లేవు. ఏమైతేనేం కాఫీకాస్త చిప్ చేస్తూ ''ఏమిటి విశేషం ఇవాళ క్లబ్బు సెలవా! చాలా రోజుల తరువాత మనం మనింట్లో అవీ ఈ సమయంలో కలుసుకున్నాం. ఏదో హడావిడే ఉండొచ్చు, కాస్త కాఫీతాగనీ, లేకపోతే హార్టు అకస్మాత్‌గా నా స్వాధీనం తప్పవచ్చు'' అన్నాడతను.

"చాల్లెండి మీ వేళాకోళం. ఏదో క్లబ్బు కార్యక్రమాలలో నలిగి బోరెక్కి రెండు రోజులుపాటు విశ్రాంతి తీసుకొందామని అసిస్టెంటు సెక్రటరీకి క్లబ్బు విషయాలప్పజెప్పి ఇలా ఉందామనుకుంటె మీకు వెళాకోళం''

"అన్నట్టు జానీ మన పుత్రికారత్నం ఎక్సిడెంటు చేసిందంటగా''

''ఏదో చేసిందిలెండి, ఇప్పుడేం కొంపలు మునిగాయని, నేను D.S.P. తో మాట్లాడి కేసు లేకుండా చేసానులెండి. ఎవడో ఫూల్ రోడ్డు కడ్డంగా నడుస్తుంటే ఏమిటౌతాది. Left hand విరిగిందట. ఒక వెయ్యి రూపాయలు వాడి ముఖాన్న కొట్టేసాను, పోతేపోయింది వెదవ డబ్బు. పీడ విరగడైయిందిలెండి''

''పాపం ఆ ఫూల్ ఎవరో కాదు మా ఆఫీసులో హెడ్ క్లార్కు. పాపం బోలెడంత సంసారం అదీను తలతాకట్టు పెట్టి పెద్ద కొడుకును B A చదివించాడు. ఆ కుర్రాడు B.A. పాసై రెండు సంవత్సరాలైయింది. తెలివైన వాడు కూడాను, అతనికి ఉద్యోగం ఇప్పించవలసినదిగా ఆ హెడ్ క్లర్కు కాళ్ళవేళ్లా పడ్డాడు. కాని ఈసారి నీ తమ్ముడికి ఇస్తానని మాటిచ్చాను, అందువలన చూస్తానులే అని పంపించేసాను. నువ్వే చెప్పు జానీ, ఇప్పుడు ఆయన చెయ్యి మన అమ్మాయి పుణ్యం కట్టుకుంది, వాళ్ళ పరిస్థితికూడా బాగా లేదు. పెద్దమ్మాయి పెళ్ళీడుకొచ్చి చాలా రోజులైయింది. ఈ ఉద్యోగం కాస్త ఆ అబ్బాయికిస్తె వాళ్ళ కన్నివిదాలా తోడ్పడిన వాళ్ళ మవుతాం, ఏమంటావ్. ఇక మీ తమ్ముడి మాటంటావా అతనికేం తక్కువ మీ నాన్నగారి కాంట్రాక్టులన్నీ అతనేగా చూస్తున్నాడు. ఇంకోసారి ఇంప్పించవచ్చు ఇప్పుడున్నది ఒకే వేకెన్సీకదా''

''మా తమ్ముడికి ఈబోడీ ఉద్యోగమెందుకో లెండి, వాడికీ ఉద్యోగం ఇప్పిస్తైమాత్రం మనకేం లాభం ఉంటుంది? ఇంకా ఆ కుర్రాడి విషయం అంటారా వాళ్ళ ఋణం ఆ వెయ్యి

రూపాయలతోనే విరగడైపోయింది. మీ అంతగా ఇవ్వాలని ఉంటే వచ్చేసారి ఎప్పుడో యివ్వండి కాని ఈసారి మాత్రం మన కంట్రాక్టర్ గారి అబ్బాయికి ఇచ్చి తీరవలసిందే, ఎప్పట్నించి గోల పెడుతున్నాను చెప్పండి. ఆ కుర్రాడికి బిజినెస్ బోరుకొడుతుందట కొన్నాళ్ళపాటు ఉద్యోగం చేయాలని సరదా పడుతున్నాడు. అతను ఈ ఉద్యోగం ఎన్నాళ్ళు చేస్తాడులెండి ఏదో సరదా తీరేవరకూ చేస్తాడు తరువాత మానేస్తాడు ఏమంటారు ? అయినా చెప్పడం మరచిపోయాను. మొన్న మన మేడ మీద గదులు రెండూ మొజెక్ చేసాడుకదా, దానికి డబ్బులిస్తే అయన పుచ్చుకోలేదు. ''మా అబ్బాయికి ఉద్యోగంలో వేయించండి చాలు, వాడికి ఈ బిజినెస్, కాంట్రాక్టులు బోరుకొడుతున్నాయట. ఉద్యోగం కొన్నాళ్ళుపాటు వెలిగిస్తాడట, వాడి కోర్కె తీర్చండి చాలు'' అన్నాడతను. ''ఈసారి వేకెన్సి వచ్చినప్పుడు తప్పకుండా వేయిస్తానని చెప్పాను. అంతేకాదు నిన్న మన అమ్మాయి క్లబ్బుకు వచ్చినప్పుడు, ఆ కాంట్రాక్టర్ గారి భార్య మెడలోని నెక్లెస్ చూసి వివరాలు అడుగుతుంటే ఆమె ఏమి చెప్పిందో తెలుసునా, ''ఇదేమిటమ్మా, దీనికన్నా మంచి నెక్లెస్ చేయించి మీ యింటికి పంపిస్తాను. మావారు పెట్టిన కాంట్రాక్టు వచ్చేటట్లు మీ నాన్నగారికి చెప్పు'' అందావిడ ''అది ఎలాగైనా వాళ్ళకి వెళ్ళాలి. వాళ్లు మనకంత సహాయం చేస్తుంటే ఈ మాత్రం మనం చేయకపోతే ఎలా! ఏది ఎలా అయినా వాళ్ళబ్బాయికి ఉద్యోగం, ఆయనకి ఆ కాంట్రాక్టు వచ్చి తీరవలసినదే'' దీనితో క్లబ్బులో నా ప్రెస్టేజి పెరుగుతుంది. మన అమ్మాయి కోర్కెలు తీరుతాయి. ఇక మీ పార్టీలకు ప్రెసిడెంట్ కావాలన్నారు కదా అది కూడా పంపించమని చెప్పాను.

'' అదికాదుజానీ ''

''అదికాదు ఇదికాదు అంటే లాభంలేదు ఈసారికి నే చెప్పినట్లు అవ్వవలసిందే లేకపోతే నా ప్రిస్టేజీ పోతుంది, నానారబస అవుతుంది, నేను ముందరే మనకు కావలసినవన్నీ అతనితో చెప్పి చెయించేసుకొన్నాను. ఇక మీతో మాట్లాడుతూ కూర్చోడానికి నాకు టైంలేదు. నేను శాపింగ్‌కి వెళ్ళాలి వస్తా'' అంటూ తిరిగిచూడకుండా కారు షెడ్డువైపు దారితీసింది. కారు బయటకి వెళ్ళిన చప్పుడు వినిపించింది. రాజారావ్ బుర్రలో కారు చప్పుడు ఇంకా గుర్రుపెడుతూనేఉంది. అతను ఆలోచించడానికి ఏమి మిగలలేదు. ఏమి చేసేది లేక అక్కడ ఉన్న స్పెన్సరు చుట్ట నోట్లో పెట్టుకొని సిజర్‌లైట్ కొట్టాడు. లైటర్‌మీద ఉన్న డేన్సింగ్ డాల్ అతనికి నైట్‌క్లబ్ విషయం గుర్తుతెచ్చింది, ఫలితంగా రాజారావ్ గారి కారు నైట్‌క్లబ్ ఆవరణలో ఆగింది.

కథాంజలి
(మాస పత్రిక)
విడి ప్రతి ... 30 పై. లు
సంవత్సర చందా ... రూ, 6-00
(రెండు ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు స్వదేశ మిత్రన్ బుక్ స్టాల్సులలోను దొరుకును.